క్లుప్తంగా

కళా సేవ గొప్పది
ఎమ్మెల్యే గణబాబు


పురస్కారాలు అందుకున్న వారితో ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం కళాసేవా పీఠం చేస్తున్న కళా సేవ ఎంతో గొప్పదని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. కళాసేవా పీఠం కార్యాలయంలో సోమవారం కళాసేవా పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న గణబాబు శిల్పాచార్యులు వల్లూరి చిట్టిబాబును ఘనంగా సత్కరించారు. అంతే కాకుండా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాసేవా పీఠం ప్రారంభించిన 8 ఏళ్లలో ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పీఠం వ్యవస్థాపకుడు నందవరపు సోములు, గౌరవ అధ్యక్షుడు కంపర సత్తిబాబు, అధ్యక్షుడు గొరకల రామదాసు, మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై నిర్మాణ మెటీరియల్
పాదచారులకు తీవ్ర ఇబ్బందులు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం వైపు వెళ్లే దారిలో బాజీ జంక్షన్ వద్ద ఫుట్‌పాత్‌పై నిర్మాణ మెటీరియల్ రోజుల తరబడి నిల్వ చేస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. బాజీ జంక్షన్ వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. ఓ ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉంటేనే కానీ వాహనాలు సవ్యంగా ముందుకు సాగని పరిస్థితులు ఉన్నాయి. అలాంటి రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలకు సంబంధించిన ఇసుక, కంకర, ఇతర మెటీరియల్‌ను రోజుల తరబడి అలానే వదిలేస్తున్నారు. దీని వల్ల పాదచారులు రోడ్డుపైకి వస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి భవన నిర్మాణ మెటీరియల్ నిల్వ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు పాదచారులు కోరుతున్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

గోరింటాకుతో వారాహి మాతకు అలంకరణ


గోరింటాకు అలంకరణలో అనఘాలక్ష్మీదేవి, వారాహి అమ్మవారు

అల్లిపురం: అల్లిపురం షిర్డీసాయి దర్బార్‌లో కొలువైన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజు సోమవారం స్వప్న వారాహి పూజ ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గోరింటాకు పాదులతో విశేషంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేసి, వారాహి స్తోత్రంతో కీర్తించారు. ఒకరికొకరు తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మీ స్మృతిలో.. మీ బాటలో..


మర్రిపాలెం వుడా లేఅవుట్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, బెహరా భాస్కరరావు తదితరులు

వైఎస్‌ఆర్.. ఆ పేరు తలచుకుంటే నేటికీ ప్రతీ మదిలో ఓ ఆత్మీయభావన కదలాడుతుంది. సంక్షేమానికి చిరునామాగా నిలిచి, పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేతపై అభిమానం వెల్లువలా జాలువారుతూనే ఉంటుంది. అందుకు నిదర్శనమే ఆ మహనీయుని జయంతి వేళ నిర్వహించిన సేవా కార్యక్రమాలు. మీ స్మృతిలో.. మీ బాటలోనే మేం అంటూ నియోజకవర్గంలో వాడవాడలా సేవా నివాళులర్పించారు. రాజన్నా..నీవు లేకున్నా నీ కీర్తి శాశ్వతమంటూ అంజలి ఘటించారు.

- వాడవాడలా ఘనంగా వైఎస్సార్ జయంతి
- మహానేతకు మనసారా సేవా నివాళి

గోపాలపట్నం: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో సేవాకార్యక్రమాలు నిర్వహించారు. మర్రిపాలెం ఉడా లేఅవుట్ పశ్చిమ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు కార్యకర్తలు, నాయకులతో కలసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, అందరికీ పంచారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు వైఎస్సార్ అన్నారు. ఆయన వారసుడిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా అభివృద్ధి చేశారన్నారు. రెండేళ్లు కరోనా వల్ల ఇబ్బందులు పడినా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని కొనియాడారు. టీడీపీ మాయ మాటల్ని నమ్మిన ప్రజలు వాస్తవాన్ని తెలుసుకుంటారన్నారు. కూటమి మెదళ్లలో ఉన్న కాలకూట విషాన్ని గ్రహిస్తారని, తగిన గుణపాఠం నేర్పిస్తారని అన్నారు. మనం ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేయాల్సిన తరుణం వచ్చిందన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై ప్రతిఘటిద్దామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, ఆడారి శ్రీనివాసరావు, నమ్మి వెంకటకృష్ణ మూర్తి యాదవ్, గొర్లె అప్పలస్వామి నాయుడు, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, వార్డు ఇన్‌చార్జి చుక్క ప్రసాదరెడ్డి, పార్టీ నాయకులు గేదెల మురళీకృష్ణ, పల్ల ఎర్ని కుమార్, మళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌ఏడీ జంక్షన్ వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

- ఎన్‌ఏడీ జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు బీఎస్ కృష్ణ, 5వ వార్డు అధ్యక్షుడు జియ్యాని మారుతి, వార్డు ఇన్‌చార్జి చెక్క ప్రసాదరెడ్డి, అధ్యక్షుడు నమ్మి వెంకటకృష్ణ మూర్తి యాదవ్, కంచిపాటి వెంకటరమణ, పేడాడ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.
- పద్మనాభనగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామి నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు సాలాపు మారయ్య, పీలాపు శ్రీనివాసరెడ్డి, కంపర కోటేశ్వరరావు, డి.మోహన్, కంపర సత్తిబాబు, రాపర్తి అప్పారావు, సాలాపు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


పద్మనాభనగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బెహరా భాస్కరరావు

మల్కాపురం: సంక్షేమ సారథి, పేదల పెన్నిధి వైఎస్సార్ జయంతిని పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. 61వ వార్డు మల్కాపురం నగరాల వీధి వద్ద పార్టీ జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభోషణం ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రీజినల్ కో–ఆర్డినేటర్ కలిదిండి బద్రీనాథ్, వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని, వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు జీవీఎస్ఎస్ రాజు (కేబుల్ వాసు), 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి (రాము), ఎస్.పైడిబాబు, ఎన్.వి.రమణ, మజ్జి కైలాస్, మజ్జి సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రకాష్‌నగర్ వద్ద గల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ సుధ పాల్గొని, వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.
- 58వ వార్డు పిలకవానిపాలెంలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 61వ వార్డు కార్పొరేటర్ సుధతో కలిసి వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


61వ వార్డు మల్కాపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బద్రీనాథ్, భోగవల్లి తదితరులు

- పిలకవానిపాలెం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు మాజీ డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, పార్టీ వార్డు అధ్యక్షుడు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొని, నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.
- 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద గల పార్టీ క్యాంప్ కార్యలయంలో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, మీసాల పెంటారావు, రేవళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- 60వ వార్డు ఇందిరా కాలనీ వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్, స్పందన బాబూరావు తదితరులు పాల్గొన్నారు.
- శ్రీహరిపురం వద్ద జరిగిన జయంతి కార్యక్రమంలో పార్టీ మహిళా నాయకురాలు మళ్ల ధనలత పాల్గొని పలువురు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

57వ వార్డులో..

కంచరపాలెం: వైఎస్సార్ జయంతిని 57వ వార్డు ఊర్వశికూడలి పరిధి తుమ్మడపాలెం కమ్యూనిటీ హాల్లో, కార్పొరేటర్ ముర్రువాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, రేసపు శ్రీనివాస్‌రెడ్డి, చెంగల ఈశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

40వ వార్డులో..

సింథియా: 40వ వార్డు ఏకేసీ కాలనీలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రీజినల్ కో–ఆర్డినేటర్ కలిదిండి బద్రీనాథ్ పాల్గొని, వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.


58వ వార్డు పిలకవానిపాలెంలో కేక్ కట్ చేసి, చిన్నారికి తినిపిస్తున్న కార్పొరేటర్లు లావణ్య, సుధ

- 62వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో వైఎస్సార్ విగ్రహానికి కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పూలమాల వేసి, నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, పేదలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.
- 63వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బద్రీనాథ్ పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పేదలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

60వ వార్డులో..

మల్కాపురం: 60వ వార్డు గుల్లలపాలెం వద్ద నిర్వహించిన వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో కార్పొరేటర్ పి.వి.సురేష్ పాల్గొన్నారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్, క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, నగర కార్యదర్శి శరగడం పత్నిరావు, గుంట సుందర్ రావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీహరిపురం వద్ద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ధనలత


57వ వార్డులో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ముర్రు వాణి


62వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు


63వ వార్డులో కేక్ కట్ చేస్తున్న బద్రీనాథ్


కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ సురేష్

ఉక్కు ఉద్యోగుల పీఎఫ్ సమస్యలపై వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్‌పై నగదు బదిలీ అయినప్పటికీ దానికి సంబంధించిన పెన్షన్ రాకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్ట్ సభ్యులు రీజనల్ పీఎఫ్ కమిషనర్ విజయకుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. నగరంలోని పీఎఫ్ కార్యాలయంలో సోమవారం ఆయన్ను కలిసిన సభ్యులు, అర్హత వచ్చిన తర్వాత పెన్షన్ దరఖాస్తు అమలు సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి స్టీల్‌ప్లాంట్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. దీనిపై పీఎఫ్ కమిషనర్ మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ అంశంపై పీఎఫ్ హెడ్ ఆఫీసు నుంచి తుది నిర్ణయం రావాల్సి ఉందన్నారు. పీఎఫ్ జమ అంశంపై ఉక్కు యాజమాన్యంతో మాట్లాడతానని తెలిపారు. త్వరలోనే స్టీల్‌ప్లాంట్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఆయన్ను కలిసిన వారిలో నరేష్‌కుమార్, చీకటి శ్రీనివాస్, రామచంద్రరావు, సైన్యా బాబు తదితరులు పాల్గొన్నారు.


పీఎఫ్ రీజనల్ కమిషనర్‌కు శాలువా కప్పి అభినందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాల నియంత్రణ

ఏయూ క్యాంపస్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చునని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో సోమవారం మోటారు వాహన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోటారు వాహన చట్టాలపై అవగాహన అవసరమన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించిన వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, న్యాయ సేవా విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎల్.వి ప్రసాద్, ఆచార్యులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న వెంకట శేషమ్మ

ఎయిడెడ్ సిబ్బందిని లెక్చరర్స్‌గా పరిగణించాలి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులను లెక్చరర్స్‌గా మాత్రమే పరిగణించాలని వర్సిటీ ఆచార్యులు కోరారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబును వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎయిడెడ్ కళాశాలల లెక్చరర్స్‌ను అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ వంటి హోదాలు ఇవ్వడం సరికాదన్నారు. ప్రభుత్వం కూడా దీనిపై ఉత్తర్వులు జారీ చేసిందని, వాటిని అమలు చేయాలని కోరారు. పరిపాలన సంబంధమైన పదవుల్లో వారు కొనసాగడం సరికాదని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.ప్రేమానందం, ఆచార్య నల్ల సత్యనారాయణ, డాక్టర్ లిల్లీ గ్రేస్, డాక్టర్ సాల్మన్ బెన్నీ, తదితరులు పాల్గొన్నారు.


ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆచార్యులు

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జనాభా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'జనాభా పోకడలు–సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు దిశగా పురోగతి' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు ఈ నెల 11న జరిగే ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా బహుమతులు ప్రదానం చేయనున్నారు. జనాభా అధ్యయన కేంద్రం సంచాలకుడు, ఏయూ స్టాటస్టిక్స్ విభాగాధిపతి ఆచార్య బి.మునిస్వామి పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వైశాఖి పార్కులో వాకింగ్ ట్రాక్ ప్రారంభం

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నూతనంగా అభివృద్ధి చేసిన నడక మార్గాన్ని సోమవారం తెరిచారు. ఇక్కడ మట్టితో నిర్మించిన వాకింగ్ ట్రాక్ మరమ్మతులకు రావడంతో ఆధునాతన నడక మార్గాన్ని నిర్మించాలని పార్క్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు సుమారు నెల రోజుల పాటు నిర్మాణ పనులు జరిగాయి. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహించిన పనులు పూర్తికావడంతో మార్గాన్ని వాకర్స్, సందర్శకులకు అందుబాటులోకి తెచ్చారు. ఈమేరకు సోమవారం వరప్రసాద్ ఆధ్వర్యంలో పార్కు సలహా మండలి సభ్యులు సంకు వెంకటేశ్వరరావు, జనపురెడ్డి పృథ్వీరాజుల చేతుల మీదుగా వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించారు. నడక మార్గం నిర్మాణానికి విశేష కృషి చేసిన పార్కు కమిటీ ఉప కార్యదర్శి రఘురామ పండాను ఘనంగా సత్కరించారు. సహకరించిన కార్యవర్గ సభ్యులు కోరాడ మురళీధర్, చింతాడ రామారావు, లంకా వెంకట సుధాకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కోశాధికారి మళ్ల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి పి.కనకరాజు, కార్యవర్గ సభ్యులు టి.సత్యనారాయణ రాజు, పి.శ్రీనివాసరావు, రోణంకి నాగేశ్వరరావు, యడ్ల దేముడు, పి.సన్యాసిరావు, వి.రాఘవయ్య, పూర్వ ఉపాధ్యక్షులు పి.గోవిందరెడ్డి పాల్గొన్నారు.


వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు, పృథ్వీరాజు, వరప్రసాద్

విత్తన బంతులతో హరిత విశాఖ సాధ్యం

ఎంవీపీ కాలనీ: విత్తన బంతులు చల్లడం వల్ల హరిత విశాఖ సాధ్యమవుతుందని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం విత్తన బంతులను తయారు చేసి అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఆహారంగా తీసుకుంటున్న పండ్ల విత్తనాలను విత్తన బంతులుగా తయారు చేసి మైదాన, కొండ ప్రాంతాలతో పాటు సముద్ర తీరాల్లో వెదజల్లితే హరిత విశాఖ రూపొందుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.


మొక్క నాటుతున్న విద్యార్థులు, గ్రీన్ క్లైమేట్ సభ్యులు

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

ఎంవీపీ కాలనీ: లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని క్లబ్ పూర్వ గవర్నర్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు సూచించారు. నగరంలోని ఓ హోటల్లో లయన్స్ క్లబ్ వాల్తేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. క్లబ్ సేవలు అన్ని వర్గాల వారికి చేరువ చేయాలన్నారు. రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. ఈ ఏడాది లక్ష మొక్కలు నాటేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం 2024–25 ఏడాదికి లయన్స్ క్లబ్ వాల్తేర్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ బి.దేముడు, కార్యదర్శిగా ఆచార్య ఎంవీ జగన్నాథరాజు, ఉపాధ్యక్షులుగా ఆచార్య పి.కింగ్, ఆచార్య ఎస్.రామకృష్ణ తదితరులు నియమితులయ్యారు.

నడిరోడ్డుపై యువకుడు హల్‌చల్

సింహాచలం: వేపగుంట నుంచి సింహాచలం వైపు వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డుపై సింహపురిలేఅవుట్ ఆర్చి వద్ద సోమవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఒక యువకుడు హల్‌చల్ చేశాడు. రోడ్డుపై వెళ్తున్న వారిని ఇష్టానుసారం బూతులు తిట్టడం, ఆదేమిటని అడిగినవాళ్లపై దాడిగి దిగాడు. దీంతో వాహనదారులు, స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ యువకుడిని పట్టుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులను కూడా ఆ యువకుడు ఇష్టానుసారం తిట్టాడు. ఆ యువకుడు పేరు లక్ష్మణ్ (22) అని, ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలియజేశారు.పోలీసులు అతన్ని పెందుర్తి పోలీసు స్టేషన్‌కి తరలించి బైండోవర్ చేశారు.


రోడ్డుపై యువకుడు హల్‌చల్ చేయడంతో గుమిగూడిన వాహనదారులు, స్థానికులు